క్లుప్తంగా

ఆర్థికసాయం



గార్ల : మండలంలోని చంద్రగిరికి చెందిన దివ్యాంగురాలు భూక్యా రోజాకు ఉపాధి కల్పించేందుకు పెద్దకిష్టాపురం గ్రామానికి చెందిన ఇన్‌కం టాక్స్ విశ్రాంత కమిషనర్ గంగావత్ రాంసింగ్ మంగళవారం రూ.50వేల నగదు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఆర్థికసాయంతో రోజా గ్రామంలో కిరాణాషాపు ఏర్పాటు చేసుకోని ఉపాధి పొందాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా రోజా తల్లిదండ్రులు, గ్రామస్తులు రాంసింగ్ ను అభినందించారు.

తాగునీటికి తిప్పలు

బయ్యారం : మండలంలోని జగ్గతండా గ్రామ పంచాయతీలోని బీసీ కాలనీ వాసులకు నాలుగు రోజులుగా తాగునీటి సరఫరా నిలిచిపోయింది. దీంతో స్థానికులు తాగునీరు లేక ఇబ్బందులు పడుతున్నారు. కాలనీకి పంచాయతీ పరిధిలోని బావి నుంచి తాగునీరు సరఫరా అవుతుంది. మోటార్ రిపేర్‌కు రావడంతో ప్రస్తుతం తాగునీటికి కటకట ఏర్పడింది. కాలనీకి ప్రత్యామ్నాయ నీటి వనరు లేకపోవడంతో నీటికోసం దూర ప్రాంతానికి వెళ్లాల్సి వస్తోందని కాలనీ వాసులు పేర్కొంటున్నారు. త్వరగా తాగునీరు అందించాలని కాలనీవాసులు అధికారులను కోరుతున్నారు.

అభినందనలు



మహబూబాబాద్ అర్బన్ : జిల్లా కేంద్రానికి చెందిన బొడ్డుపల్లి ప్రణీతమ్‌సుహాస్ కరీంనగర్‌లోని ప్రతిమ కళాశాలలో ఎంబీబీఎస్‌లో సీటు సాధించాడు. దీంతో ప్రణీతమ్ సుహాస్‌ను కుటుంబ సభ్యులు అభినందించారు.

కావ్యశ్రీకి ఎంబీబీఎస్ సీటు



గార్ల : మండలంలోని కొత్తపోచారం గ్రామానికి చెందిన మరికంటి కావ్యశ్రీ వరంగల్‌లోని ఫాదర్ కొలంబో మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ సీటు సాధించింది. 356 మార్కులతో ఎస్సీ కేటగిరి–2లో రాష్ట్రస్థాయిలో 553 ర్యాంకు సాధించింది. మెడిసిన్‌లో సీటు సాధించిన కావ్యశ్రీని, తల్లిదండ్రులు ఎం.ఉపేందర్, నాగమణిలతో పాటు గ్రామస్తులు అభినందించారు.

మండల కమిటీ ఎన్నిక



శ్రీరాం పురుషోత్తం, అధ్యక్షుడు




జి. పటేల్ నాయక్, ఉపాధ్యక్షుడు

పెద్దవంగర : స్థానిక జేసీబీ యూనియన్ మండల సమావేశాన్ని మంగళవారం నిర్వహించి కార్యకలాపాలపై చర్చించారు. అనంతరం మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పెద్దవంగరకు చెందిన శ్రీరాం పురుషోత్తం, ఉపాధ్యక్షుడిగా గుగులోత్ పటేల్ నాయక్, ప్రధాన కార్యదర్శిగా బానోత్ జేతిరాం నాయక్, కోశాధికారిగా దండుగుల శ్రీకాంత్, కార్యవర్గ సభ్యులుగా భూక్యా మహేష్, గుగులోత్ వినిత్, దేవా, సందీప్, బాలాజీ, శివరాత్రి రాజును ఎన్నుకున్నారు.

ఎంపీటీసీ రిజర్వేషన్ల ఖరారు

మహబూబాబాద్ రూరల్ : ఉత్తర తండా (బీసీ మహిళ), అయోధ్య (బీసీ జనరల్), పర్వతగిరి (బీసీ మహిళ), మాధవాపురం (బీసీ జనరల్), అమనగల్లు (ఎస్టీ మహిళ), వీఎస్ లక్ష్మీపురం (ఎస్టీ మహిళ), నడివాడ (ఎస్టీ మహిళ), జంగిలిగొండ (ఎస్టీ జనరల్), రెడ్యాల (ఎస్టీ జనరల్), కంబాలపల్లి (ఎస్టీ జనరల్), సీత్లా తండా (అన్ రిజర్వుడ్ మహిళ), లక్ష్మీపురం బ్రాహ్మణపల్లి (అన్ రిజర్వుడ్ మహిళ), మల్యాల (అన్ రిజర్వుడ్ జనరల్) గా అధికారులు ప్రకటించారు.

పరామర్శ



తొర్రూరు రూరల్: మండలంలోని గోపాలగిరి, చెర్లపాలెం గ్రామాల్లో ఇటీవల మృతి చెందిన బాధిత కుటుంబాలను మంగళవారం తొర్రూరు మార్కెట్ చైర్మన్ హనుమాండ్ల తిరుపతిరెడ్డి పరామర్శించారు.

చిన్నగూడూరు : మండలంలోని పగిడిపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు గందసిరి వెంకన్న కొన్ని రోజులుగా బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్ మంగళవారం పగిడిపల్లిలో వెంకన్న ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

కంకర తేలిన బీటీ రోడ్డు

వాహనదారులకు తప్పని తిప్పలు
- పట్టించుకోని అధికారులు, పాలకులు
- మరమ్మతు చేయాలని ప్రజల వేడుకోలు

కురవి : బీటీ రోడ్డుపై కంకర తేలడంతో వాహనదారులు, ప్రయాణికులు నానా అవస్థలు పడుతున్నారు. మండలంలోని నల్లెల్ల శివారు గాజ తండా గ్రామ పరిధిలోని టీకుల తండా నుంచి రాజోలు గ్రామానికి వెళ్లే బీటీ రోడ్డు శిథిలమైంది. చాలా ఏళ్ల క్రితం నిర్మించిన బీటీ రోడ్డుపై కంకర తేలి ఉన్నాయి. దీంతో ఆ రోడ్డుపై వెళ్లే ప్రయాణికులు, వాహనదారులు, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కనీసం నడిచి వెళ్లాలన్నా ప్రజలు తిప్పలు పడుతున్నారు. ఆ రోడ్డు గుండా రైతులు ఎక్కువగా పంట చేలకు వెళ్తుంటారు. అలాగే బలపాల, రాజోలు, డోర్నకల్ వైపు నుంచి కురవి మండలానికి రావాలంటే దగ్గరగా ఉండడంతో కంకర రోడ్డుపై రావాల్సిందే. రోడ్డు ఇలా ఉంటే ప్రయాణం చేసేదేలా అని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు ఈ రోడ్డును పరిశీలించి మరమ్మతు చేయాల్సిన అవసరం ఉంది. టీకుల తండా నుంచి రాజోలు వరకు, అక్కడి నుంచి తిర్మలాపురం వరకు కొత్తగా బీటీ రోడ్డు నిర్మించాల్సి ఉంది.



కంకర తేలి అధ్వానంగా మారిన రోడ్డు

ఎల్ఈడీ స్క్రీన్ ఏర్పాటు

మహబూబాబాద్ రూరల్ : మహబూబాబాద్ మార్కెట్ ఆవరణలో నూతనంగా వ్యవసాయ ఉత్పత్తులకు నిర్ణయించిన ధరలను ప్రదర్శించే ఎల్ఈడీ స్క్రీన్‌ను మంగళవారం ఏర్పాటు చేశారు. దీంతో రైతులకు కేటాయించిన లాట్ ఐడీల వివరాలు, రైతుల ఊరు,పేరు, రైతులు తీసుకువచ్చిన వ్యవసాయ ఉత్పత్తుల వివరాలు, వ్యాపారులు నిర్ణయించిన కొనుగోలు ధరలు, కొనుగోలు చేసిన సంస్థ పేరు ఇలా పలు రకాల వివరాలను తెలుసుకునేందుకు వీలుంటుంది.



ఏఎంసీలో ఏర్పాటు చేసిన ఎల్ఈడీ స్క్రీన్

ఇంద్రధనస్సు కనువిందు



గార్ల : మండలంలో చిరుజల్లులు కురిసిన అనంతరం ఆకాశంలో ఇంద్రధనస్సు (రెయిన్‌బో) కనువిందు చేసింది. దీంతో మంగళవారం గార్ల పట్టణవాసులు ఇంద్రధనస్సును వీక్షించి ఆనందం వ్యక్తం చేశారు.

‘స్థానిక’ ఎన్నికల్లో గిరిజనులకు అన్యాయం

మహబూబాబాద్ : స్థానిక సంస్థల ఎన్నికల రిజర్వేషన్లలో గిరిజనులకు అన్యాయం చేశారని గిరిజన సంఘం నాయకులు దేవేందర్, విజయ్ ఆవేదన వ్యక్తం చేశారు. సంఘం ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో రిజర్వేషన్ల విషయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..జనాబా శాతాన్ని ఆధారంగా చేయకుండా ఇష్టారాజ్యంగా రిజర్వేషన్లు చేశారన్నారు. 99 శాతం గిరిజనులు ఉన్న గ్రామాలను కూడా బీసీకి కేటాయించారని తెలిపారు. కురవి మండలంలోని పలు జీపీల విషయంలో మరీ దారుణంగా రిజర్వేషన్ల ప్రక్రియ చేశారన్నారు. ఈ కార్యక్రమంలో గోప, లాల్‌సింగ్, శోభన్, సక్రు, తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీఓగా దుబ్బతండా వాసి



కిషోర్‌కుమార్

తొర్రూరు : పట్టణంలోని దుబ్బతండాకు చెందిన జాటోత్ కిషోర్ కుమార్ గ్రూప్–1 ఫలితాల్లో సత్తా చాటి ఎంపీడీఓగా ఎంపికయ్యారు. కిషోర్‌కుమార్ పెద్దగూడూరు ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తూ గ్రూప్–1కు సన్నద్ధమయ్యాడు. ఎంపీడీఓగా ఎంపికై ఇటీవల నియామకపత్రం అందుకున్న కిషోర్‌కుమార్‌ను స్థానికులు అభినందించారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

దంతాలపల్లి : మండల కేంద్రంలోని బస్టాండ్‌లో మంగళవారం గుర్తు తెలియని ఓ వ్యక్తి మృతిచెంది ఉన్నాడు. ఎస్సై రాజు కథనం ప్రకారం .. మంగళవారం ఉదయం పారిశుద్ధ్య కార్మికులు తమ బస్టాండ్ ఆవరణలో శుభ్రం చేస్తున్నారు. ఈ క్రమంలో బస్టాండ్‌లో ఓ మృతదేహాన్ని చూసిన కార్మికులు ఎస్సై రాజుకు సమాచారం ఇవ్వగా సిబ్బందితో అక్కడికి చేరుకుని పరిశీలించారు. అనాథ మృతదేహం అని కొన్నేళ్లుగా మండల కేంద్రంలో యాచిస్తు జీవితం గడుపుతున్నాడని అన్నారు. గ్రామ పంచాయతీ సిబ్బంది సాయంతో ఆ మృతదేహానికి దహన సంస్కారాలు చేసినట్లు ఎస్సై తెలిపారు.


అనుమానాస్పదంగా వ్యక్తి..



లకావత్ కోట్య (ఫైల్)

గూడూరు : మండలంలోని ఏపూరు శివారు టీకులతండాలో సోమవారం రాత్రి ఓ వ్యక్తి ఇంట్లో అనుమానాస్పద స్థితిలో మృతిచెందగా మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై బి.గిరిధర్‌రెడ్డి తెలిపారు. టీకులతండాకు చెందిన లకావత్ కోట్యా (40) ఇంట్లో ఉరి వేసుకొని మృతి చెందాడు. మృతుడి తల్లి లకావత్ చాంది ఫిర్యాదు చేయడంతో సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతుడికి భార్య, కూతుళ్లు, కొడుకు ఉన్నారు.

అనారోగ్యంతో ప్రభుత్వ ఉపాధ్యాయుడు..



రమేశ్ (ఫైల్)

డోర్నకల్ : మండలంలోని హూన్యాతండా పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న తాళ్లపల్లి రమేశ్ (61) మంగళవారం అనారోగ్యంతో మృతి చెందాడు. హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం బత్తినివానిపల్లెకు చెందిన రమేశ్ హూన్యాతండా పాఠశాలలో పనిచేస్తున్నాడు. రమేశ్ మరి కొద్దికాలంలోనే పదవీ విరమణ చేయాల్సి ఉంది. అయితే ఆయన అనారోగ్యంతో బాధపడుతూ హనుమకొండలోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. రమేశ్ మృతితో పలు ఉపాధ్యాయ సంఘాలు సంతాపం తెలిపాయి.

దాడి చేసిన ఇద్దరిపై కేసు

మహబూబాబాద్ రూరల్ : దాడిచేసిన ఘటనలో బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇద్దరిపై కేసు నమోదు చేశామని మహబూబాబాద్ సీఐ గట్ల మహేందర్ రెడ్డి మంగళవారం తెలిపారు. సీఐ కథనం ప్రకారం.. ఓ విషయం మాట్లాడేది ఉంది రమ్మని చెప్పి బోడ రమేష్, గుగులోత్ భీమానాయక్ సోమవారం రాత్రి జిల్లా కేంద్రానికి చెందిన జర్నలిస్టు లావుడియా రాము నాయక్‌కు ఫోన్ చేశారు. ఈ క్రమంలో రాము నాయక్ తన బైక్‌పై కురవి గేట్ ఆర్‌ఓబీ ప్రాంతం వద్దకు చేరుకున్నాడు. కాగా రమేష్, భీమానాయక్ కలిసి అతనిపై అకారణంగా దాడి చేశారు. ఈ ఘర్షణలో సెల్ ఫోన్ ధ్వంసం కాగా రాము నాయక్ ఫిర్యాదు మేరకు ఇరువురిపై కేసు నమోదు చేశామని సీఐ పేర్కొన్నారు.

సమాజ సేవకు ఆర్ఎస్ఎస్ ప్రాధాన్యం

- బౌద్ధిక్ ప్రముఖ్ వెంకటేశ్

ఖానాపురం : సమాజ సేవకు రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) ప్రాధాన్యత ఇస్తుందని బౌద్ధిక్ ప్రముఖ్ బాషబోయిన వెంకటేశ్ తెలిపారు. సంఘ్ స్థాపించి వందేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా మండలంలోని మనుబోతులగడ్డలో మంగళవారం శతాబ్ది ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సమాజ సేవలో పౌరుడు ముందుండాలని ఆకాంక్షించారు. అనుకోకుండా ఏవైనా విపత్తులు చోటు చేసుకుంటే స్వయం సేవకులు ప్రజాసేవలో క్రియాశీలకంగా భాగస్వాములు కావాలని సూచించారు. దేశసేవలో సంఘ్ సేవకులు పాల్గొనాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘ్ బాధ్యులు కుసుమ శ్రీనివాస్, ఆబోతు రాజు, పురుషోత్తం, తేజావత్ శ్రీకాంత్, రాజేందర్, మహేందర్, జయంత్, తదితరులు పాల్గొన్నారు.

దసరా వేడుకలకు ఏర్పాట్లు



గూడూరు : ఉమ్మడి వరంగల్ జిల్లా ఉర్సులో జరిగే దసరా ఉత్సవాల తర్వాత మహబూబాబాద్ జిల్లా గూడూరు మండల కేంద్రంలోనే దసరా ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తారు. ప్రతీ సంవత్సరం గ్రామపంచాయతీ, హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో స్థానిక రామ్‌లీలా (అంగడి) మైదానంలో దసరా వేడుకలు ఘనంగా జరుగుతాయి. ఆ క్రమంలో మంగళవారం హిందూ ఉత్సవ సమితి ప్రతినిధులు రామ్‌లీలా మైదానంలో ఉత్సవ ఏర్పాట్లకు డోజర్‌తో చదును చేయిస్తున్నారు. ఈ సంవత్సరం దసరా వేడుకలను కనుల పండువగా జరిపించేందుకు కరీంనగర్ జిల్లాకు చెందిన వారిచే డిజిటల్ స్టేజీతో పాటు ఐదువేల కుర్చీలు ఏర్పాటు చేస్తున్నామని హిందూ ఉత్సవ సమితి అధ్యక్షుడు పింగిళి శ్రీనివాస్ తెలిపారు.

కాల్వలు కబ్జా.. ఆపై నిర్మాణాలు

- పట్టించుకోని అధికారులు

మహబూబాబాద్ : కొంత మంది కాల్వలను కూడా వదలకుండా నిర్మాణాలు చేపడుతున్నారు. మరికొందరు అనుమతులు కూడా లేకుండానే అక్రమ నిర్మాణాలు చేస్తున్నా అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారు. దీంతో పారిశుద్ధ్య సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. కాల్వల కబ్జాతో వర్షాకాలంలో సమస్య తీవ్రంగా ఉంటుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మానుకోట మున్సిపాలిటీ పరిధి కంకర బోడ్ ప్రాంతంలోని సంప్ హౌజ్ పక్కన ఓ వ్యాపారి కాల్వపైనే నిర్మాణం చేపట్టారు. అనుమతులు తీసుకోకుండా దర్జాగా నిర్మాణ పనులు చేస్తున్నారు. కాల్వ కబ్జాతో పారిశుద్ధ్య సమస్య తలెత్తుతుందని ఆ ప్రాంత ప్రజలు మున్సిపాలిటీలో ఫిర్యాదు చేశారు. అయినా సంబంధిత అధికారులు నిర్మాణ పనులను అడ్డుకోవడం లేదు. జవాన్లు చిరంజీవి, శ్రీను అక్కడికి వెళ్లి కాల్వపై నిర్మాణంతో సమస్య వస్తుందని చెప్పినా వినకుండా అలాగే నిర్మాణాలు చేస్తున్నారు. ఏ క్యాబిన్ రోడ్డులో గ్యాస్ గోదాం సమీపంలో మూడు ఇళ్లు పూర్తిగా మున్సిపాలిటీ కాల్వపై నిర్మించారు. రెడ్డి బజార్‌లో, నర్సంపేట రోడ్డులో పలు కాలనీల్లో కూడా కాల్వపై నిర్మాణాలు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదు. నెహ్రూ సెంటర్, మోడల్‌మార్కెట్ ఎదుట పలువురు రోడ్లపై బోర్లు ఏర్పాటు చేశారు. అయినా వారిపై చర్యలు తీసుకోలేదు. సమస్యలు ఉన్నా అధికారులు వారిపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. మాముళ్లు తీసుకుని వదిలేస్తున్నారని అని ప్రజలు ఆరోపిస్తున్నారు. వెంటనే అక్రమ నిర్మాణాలను కూల్చివేయాలని కోరుతున్నారు.



కంకరబోడ్‌లో కాల్వపై చేస్తున్న నిర్మాణం

పంటలకు మద్దతు ధర చెల్లించాలి



సమావేశంలో మాట్లాడుతున్న వెంకన్న

నెహ్రూసెంటర్ : యూరియా కొరత, అధిక వర్షాలతో రైతులు తీవ్రంగా నష్టపోయారని వారిని ఆదుకునేందుకు పత్తి, వరి, మిరప పంటలకు మద్దతు ధర చెల్లించాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి శెట్టి వెంకన్న కోరారు. జిల్లా కేంద్రంలోని జగన్నాథం భవన్‌లో సంఘ సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పత్తికి క్వింటాకు రూ.10 వేలు, మొక్కజొన్నకు క్వింటాకు రూ.3 వేల చొప్పులు ధర చెల్లించాలన్నారు. పత్తి పంటలకు ఎకరాకు రూ.50 వేలు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. రైతాంగ సమస్యలపై పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. నల్లపు సుధాకర్, మార్తినేని పాపారావు, గుడ్డిపాటి రాజారావు, సంబూరి మధు, ధరావత్ బుజ్జి, బొబ్బ ఉపేందర్, తిరుపతిరావు, జలంధర్, కొడవండ్ల సైదులు, చందా వెంకన్న, కొత్త ప్రభాకర్‌రెడ్డి, పుల్లయ్య, సర్సయ్య పాల్గొన్నారు.

సీహెచ్‌సీలో వైద్యులను వెంటనే నియమించాలి

- సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు శ్రీనివాసరావు



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

గార్ల : మండలంలోని సీహెచ్‌సీలో ఖాళీ వైద్యుల పోస్టులను వెంటనే భర్తీ చేసి మెరుగైన వైద్యసేవలు అందించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కందునూరి శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గార్లలో 30 పడకల ఆస్పత్రి నిర్మించిన సరిపడ వైద్యుల పోస్టులను భర్తీ చేయడంలో విఫలమైందన్నారు. సీహెచ్‌సీలో వైద్యులు లేకపోవడంతో ప్రజలు వైద్యం కోసం ఖమ్మం, మహబూబాబాద్ పట్టణాల్లోని కార్పొరేట్ ఆస్పత్రులకు వెళ్లి వైద్యం చేయించుకుంటూ ఆర్థికంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబంధిత ఎంపీ, ఎమ్మెల్యే, డీసీహెచ్ఎస్, కలెక్టర్ స్పందించి ఆస్పత్రిలో వైద్యుల ఖాళీలను భర్తీ చేపట్టాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జి.రాజారావు, వి.పెద్దవెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మద్యం, మాంసంపై మీమాంస

- ఒకే రోజు గాంధీ జయంతి, దసరా వేడుకలు
- పండుగ రోజు దుకాణాలు బంద్

గూడూరు : హిందూ సంప్రదాయంలో పండుగలకు ఒక ప్రత్యేకమైన స్థానం ఉంది. అందులో దసరా పర్వదినం అంటేనే అందరూ ఎంతో సంబురపడిపోతారు. దసరా రోజు ప్రతీ ఇంట్లో పిండి వంటకాలతో పాటు మాంసం, మద్యం వంటివి స్వీకరిస్తారు.అయితే ఈ ఏడాది దసరా పండుగ అక్టోబర్ 2వ తేదీన (గురువారం) వస్తుంది. గాంధీ జయంతి రోజున జీవ హింస చేయరాదు అనే సిద్ధాంతంతో ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా మద్యం, మాంసం దుకాణాలను నిషేధించింది. దసరా పండుగ ఈసారి గాంధీ జయంతి రోజున వచ్చింది.. అదే రోజు మద్యం, మాంసంపై నిషేధంతో పండుగ నిర్వహణ ఎలా..! అన్న చర్చ ప్రజల్లో జోరుగా సాగుతుంది. ఈ నేపథ్యంలో మద్యం, మాంసం విక్రయాలపై సందిగ్ధత నెలకొంటుంది. మహబూబాబాద్ జిల్లాలో మొత్తం 59 వైన్స్‌లతో పాటు పదుల సంఖ్యలో బార్లు, రెస్టారెంట్లు ఉన్నాయి. జిల్లా మొత్తంలో సుమారు 300 పైగా మాంసం విక్రయ దుకాణాలు కొనసాగుతున్నాయి. దసరా పర్వదినం గాంధీ జయంతి రోజున రావడంతో మద్యం, మాంసం దుకాణాలు బుధవారం సాయంత్రం నుంచే మూతపడనున్నాయి.

లక్ష్య సాధనకు పేదరికం అడ్డు కాదు

- గ్రూప్–2 సాధించిన మధుకు సన్మానం

తొర్రూరు : స్థానిక రిక్షా కాలనీకి చెందిన నకిరకంటి మధు ఇటీవల విడుదలైన గ్రూప్–2 ఫలితాల్లో 447 మార్కులు సాధించి సబ్ రిజిస్ట్రార్‌గా ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా మంగళవారం డివిజన్ కేంద్రంలోని రిక్షా కాలనీలో మధును ఎంఈఎఫ్ నాయకులు సన్మానించారు. మాదిగ న్యాయవాదుల సంఘం జాతీయ అధ్యక్షుడు వి. వెంకటరత్నం, ఎంఈఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సోమారపు ఐలయ్య మాట్లాడుతూ.. విద్యార్థులు ఉన్నత లక్ష్యాన్ని నిర్దేశించుకుని దాని సాకారం దిశగా కృషి చేయాలన్నారు. లక్ష్య సాధనకు పేదరికం అడ్డు కాదని మధు నిరూపించాడన్నారు. కార్యక్రమంలో ఎంఈఎఫ్ నాయకులు మహంకాళి బుచ్చయ్య, తాటికాయల సురేందర్, గుండాల రంజిత్‌కుమార్, ఈదురు రమేష్, ఎర్ర వెంకన్న, బందు యాకయ్య, వెల్తూరి మల్లేశం తదితరులు పాల్గొన్నారు.



మధును సత్కరిస్తున్న ఎంఈఎఫ్ నాయకులు

దుర్గాదేవి అలంకరణలో అమ్మవారు



డోర్నకల్: ఉయ్యాలవాడలో అన్నదానం..



మహబూబాబాద్ రూరల్: హరిజనవాడలో..



మహబూబాబాద్ రూరల్: గంగపుత్ర సంఘ భవనంలో దుర్గాదేవికి పూజ చేస్తున్న భక్తులు

గూడూరు : మండల కేంద్రంలోని దుర్గాదేవి మండపం ఎదుట మాలాధారుడు అయినవోలు మంజుల శ్రీధర్‌శర్మ దంపతులు మంగళవారం అన్నదానం చేశారు. అనంతరం శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారు దుర్గాదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా మహిళలు, భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

మహబూబాబాద్ రూరల్ : మహబూబాబాద్ మున్సిపల్ పరిధిలోని హరిజనవాడ కమిటీ హాల్, గంగపుత్ర సంఘ భవనంలో కొలువుదీరిన దుర్గాదేవి అమ్మవారికి భక్తులు మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవిశరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన అమ్మవారు దుర్గాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.



గూడూరులో అన్నదానం చేస్తున్న నిర్వాహకులు

ఊరూరా అన్నదానాలు..

డోర్నకల్ : శరన్నవరాత్రులను పురస్కరించుకుని మంగళవారం ఊరూరా అన్నదానాలు నిర్వహించారు. డోర్నకల్‌లోని ముత్యాలమ్మతల్లి ఆలయం, ఉయ్యాలవాడలోని కొత్తబజారు, చిలుకోడులోని మెయిన్ బజారులో అన్నదానం చేశారు.

బయ్యారం : బయ్యారంలోని గాంధీసెంటర్, రామాలయం వద్ద నిర్వహించిన అన్నదాన కార్యక్రమాల్లో గార్ల–బయ్యారం సీఐ రవికుమార్, ఎస్సై తిరుపతి పాల్గొని పూజలు చేశారు. అనంతరం అన్నదానం ప్రారంభించారు.



బయ్యారం: దుర్గామాత వద్ద పూజలు చేస్తున్న సీఐ, ఎస్సై



అన్నదానంలో పాల్గొన్న భక్తులు

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు



రాయపర్తి : రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్టు స్థానిక ఎస్సై ముత్యం రాజేందర్ తెలిపారు. మండలంలోని తిర్మలాయపల్లి నుంచి రాయపర్తికి వెళ్లే దారిలో ఏపుగా పెరిగిన ముళ్లచెట్లను గ్రామస్తులు ఆయన దృష్టికి తీసుకురాగా స్పందించారు. జేసీబీ సాయంతో మంగళవారం ముళ్లచెట్లను తొలగింపజేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడారు. గ్రామీణ ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చూడడమే లక్ష్యంగా కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. పోలీసులు చేపట్టే కార్యక్రమాలకు ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ ముద్రబోయిన వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ ఎస్సీ సెల్ గ్రామ అధ్యక్షుడు వశపాక ఎల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.